ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 18-10-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ పలు రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కొనసాగుతోంది. ఈ బందు వల్ల ప్రధానమంత్రికి కనువిప్పు అవుతుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

2. ఆయిల్ ఫామ్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

3. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోజ్ గార్ మేళా 17వ విడతను ఈ నెల 24న దేశవ్యాప్తంగా నిర్వహించనుంది.

4. రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు. పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

బీసీ బంద్-స్టేట్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ 'బంద్ ఫర్ జస్టిస్' పేరిట బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా కొనసాగుతోంది.

ఉదయం నుంచే మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, వామపక్షాలు సహా పలు రాజకీయ పార్టీల నేతలు, వివిధ సంస్థల కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు, ధర్నాలు, మానవహారాలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల వద్ద బస్సులను అడ్డుకున్నారు. దీంతో హైదరాబాద్ తో పాటు పలు జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రవాణా సౌకర్యం లేక ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని పలు ప్రాంతాల్లో క్యాబ్లు, ప్రైవేటు రవాణా వాహనాల డ్రైవర్లు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. బంద్ కు మద్దతుగా వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడగా, విద్యా సంస్థల యాజమాన్యాలు సెలవులు ప్రకటించాయి. అత్యవసర సేవలకు మాత్రం బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఆసిఫాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నల్లగొండ, కొత్తగూడెం, సిరిసిల్ల, నిర్మల్, మెదక్,నాగర్ కర్నూల్ తదితర జిల్లాల కేంద్రాల్లో బీసీ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. కామారెడ్డి బీసీ జేఏసీ నాయకులు హైకోర్టు స్టే ఆర్డర్ ను నిరసిస్తూ తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు.

(పీటీసీ, ఆసిఫాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, కామారెడ్డి, జగిత్యాల, నల్లగొండ, కొత్తగూడెం, సిరిసిల్ల, నిర్మల్, మెదక్, నాగర్ కర్నూల్)

<u>మహేశ్ గౌడ్</u>

బీసీ బంద్'కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్ వద్ద బీసీ సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా, శాంతియుతంగా బంద్ పాటిస్తున్నారని తెలిపారు. కులగణన, రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ వద్దకు పంపితే, కేంద్ర ప్రభుత్వం వాటిని అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. ఈ బంద్ వల్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కనువిప్పు అవుతుందని అన్నారు.

(ఎస్డీపీ)

**బంద్-మంత్రి వివేక్**

42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ నేతలందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా, మందమర్రిలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్, బీసీలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ప్రకటించారు.

**(పీటీసీ, మంచిర్యాల)**

బంద్- మంత్రి కొండా సురేఖ

42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ సంతకం చేయకపోవడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం లేదని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. ఈ ఆలస్యానికి బీజేపీ కుట్రపూరిత వైఖరే కారణమని, కోర్టుల్లో కేసులు వేసి బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ బంద్ లో భాగంగా సికింద్రాబాద్ లోని రేతిఫైల్ బస్టాప్ వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తో కలిసి మంత్రి నిరసనల్లో పాల్గొన్నారు.

**(పీటీసీ, హైదరాబాద్)**

**బీసీ బంద్-తుమ్మల**

బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉంచి కేంద్ర ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటోందని మంత్రి తమ్మల నాగేశ్వర రావు ఆరోపించారు. ఖమ్మం జిల్లా, సత్తుపల్లిలో రాష్ట్ర బంద్ కార్యక్రమంలో భాగంగా మంత్రి నిరసన ర్యాలీని ప్రారంభించారు.

(PTC, khammam)

**బీసీలకు పూర్తి మద్దతు — మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

బీసీ వర్గాల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్ సాధన దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీల ఆకాంక్షలకు అనుగుణంగా రిజర్వేషన్లలో వారికి న్యాయమైన వాటాను సాధించి తీరుతామని పేర్కొన్నారు.

(సౌండ్ బైట్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్)

(జగిత్యాల జిల్లా, పీటీసీ)

<u>**ఆయిల్ ఫామ్-తుమ్మల**</u>

ఆయిల్ ఫామ్ ఉత్పత్తిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం నారావారిగూడెంలో తెలంగాణ రాష్ట్ర నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధునిక పద్ధతిలో ఆయిల్ పామ్ విత్తనాలు నాటే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆయిల్ పామ్ విత్తన నాణ్యతను కాపాడటం అత్యంత కీలకమని, నాణ్యత లేని తల్లి మొక్కలను నర్సరీ నుంచి బయటకు తీసుకురావద్దని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 నుంచి 20 లక్షల ఎకరాలకు ఆయిల్ పామ్ సాగును విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. పామాయిల్ రైతులు అధిక లాభాలు పొందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

(సౌండ్ బైట్ మంత్రి తుమ్మల)

**(పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం)**

రోజ్ గార్ మేళా:

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రోజ్ గార్ మేళా 17వ విడతను ఈ నెల 24న దేశవ్యాప్తంగా నిర్వహించనుంది. హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంలో తపాలా, సెంట్రల్ GST, కస్టమ్స్, IIT హైదరాబాద్, మానూ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, రైల్వే వంటి విభాగాల్లో వివిధ పోటీ పరీక్షల్లో ఎంపికయిన అభ్యర్థులకు ఈ సందర్భంగా నియామక పత్రాలను అందజేయనున్నారు.

(MSL)

**ఆసిఫాబాద్-ఖరీఫ్ ధాన్యం**

ఆసిఫాబాద్ జిల్లాలో 2025-26 ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లో ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతూ... ఈనెల 24వ తేదీ లోగా 40 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

**జీఎస్టీ బైట్-సిరిసిల్ల**

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం తనలాంటి సామాన్య ప్రజలకు చాలా లాభం ఉందని, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నాంపల్లికి చెందిన బండారి సౌజన్య చెప్పారు. జీఎస్టీ సవరణ తర్వాత తాను ద్విచక్ర వాహనం కొనుగోలు చేయడంతో పది వేల రూపాయల ధర తగ్గిందని ఆకాశవాణితో చెప్పారు.

(సౌండ్ బైట్ -బంగారి సౌజన్య)

(పిటిసి రాజన్న సిరిసిల్ల జిల్లా)

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఈవేళ భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**(డెస్క్)**

**ఆసిఫాబాద్ కలెక్టర్**

ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా 'గిరిజన గ్రామాల విజన్ 2030' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్, దోత్రే తెలిపారు. న్యూఢిల్లీలో గిరిజన అధికారుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన జాతీయ సదస్సులో కలెక్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లాలోని వాంకిడి మండలం కిరిడి గ్రామపంచాయతీ పరిధిలోని లింబుగూడలో గిరిజనుల కోసం బహుళార్థక ప్రయోజన కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామన్నారు.

**(పీటీసీ, ఆసిఫాబాద్)**

**హన్మకొండ-క్రీడలు**

వరంగల్ జిల్లా హన్మకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ స్థాయి ఓపెన్ అండర్-23 అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పోటీలకు ఈ రోజు చివరి రోజు కాగా.. పలు విభాగాల్లో ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. పురుషుల 20 కిలోమీటర్ల రేస్ వాక్ పోటీలో ఆర్మీ అథ్లెట్ సచిన్ బోరా సరికొత్త 'మీట్ రికార్డు'ను నెలకొల్పారు. ఈ రేసును ఒక గంట 26 నిమిషాల 59 సెకన్లలోనే పూర్తి చేశారు.

**(పీటీసీ, వరంగల్ జిల్లా)**

<u>**సిపిఆర్ పై - అవగాహన**</u>

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో సీపీఆర్ పై డాక్టర్ మహేష్ కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అకస్మాత్తుగా గుండె కొట్టుకోవడం ఆగిపోతే సిపిఆర్ తో తిరిగి గుండె పనిచేసేలా చూడవచ్చన్నారు. వైద్య సిబ్బంది సిపిఆర్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

**(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)**

<u>భద్రాద్రి కొత్తగూడెం –డ్రగ్స్</u>

చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాలలో భాగంగా నిన్న జిల్లావ్యాప్తంగా పాన్ షాపుల్లో ఏక కాలంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లందు, మణుగూరు, భద్రాచలం సబ్ డివిజన్ల డిఎస్పీల ఆధ్వర్యంలో పోలీస్ జాగిలాల సహాయంతో ఈ తనిఖీలు నిర్వహించారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలను నిర్మూలనే లక్ష్యంగా నిత్యం ఇలాంటి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని కొత్తగూడెం డీఎస్పీ రహమాన్ తెలిపారు.

**(PTC-B.KGM)**

GST

GST రేట్ల తగ్గింపు వినియోగ దారుల స్పెండింగు ను గణనీయంగా లుపెంచిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. "ఢిల్లీలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... GST సంస్కరణల వల్ల 2 లక్షల కోట్ల రూపాయిలు ఆర్థిక వ్యవస్థలోకి వస్తాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వాహనాలు, TV వంటి అంశాల లో అమ్మకాలు

గణనీయమైన పెరుగుదల చూపాయని పేర్కొన్నారు. ఆశించియాన్ ప్రయోజనాలు ప్రజలకు చేరుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం విలేకరుల సమావేశం కొనసాగుతోంది.

MSL